www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 11 జనవరి 2023 5

ఏలూరు

విపత్తుల నష్ట నివారణకు ప్రణాళిక : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల ద్వారా కలిగే నష్టాలను తగ్గించుకునే దిశగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నియంత్రణ, ముందస్తు చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా వరదలు, భారీ వర్షాలు, తుపాను, కరువు వంటివి ఏర్పడిన సమయంలో కలిగే నష్టాలను తగ్గించుకొనేందుకు, వాటిని అధికమించే విషయంపై తీసుకోవాల్సిన చర్యలు గురించి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. భవిష్యత్‌లో నష్టం సంభవించకుండా ఉండేందుకు ముందస్తు పనుల వివరాలతో కూడిన సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

రవాణా ఛార్జీలు వచ్చేనా..!

ధాన్యం కిరాయి సొమ్ము కోసం లారీ, ట్రాక్టర్ యజమానుల ఎదురుచూపు

ఒక్క ఏలూరు జిల్లాలోనే రూ.పది కోట్ల వరకూ బకాయి

21 రోజుల్లో చెల్లింపు నిబంధనకు పూర్తిగా తూట్లు

లబోదిబోమంటున్న వాహన యజమానులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం నూతన కొనుగోలు విధానంలో అటు రైతులతోపాటు ఇటు ధాన్యం రవాణా చేసిన లారీ, ట్రాక్టర్ యజమానులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం తరలించిన వాహన యజమానులు రవాణా ఛార్జీల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యం తరలించిన 21 రోజుల్లో ధాన్యం రవాణా సొమ్ము జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ రైతుభరోసా కేంద్రాల ద్వారా 3.12 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. నూతన కొనుగోలు విధానంలో ధాన్యం తరలింపు రవాణా ఛార్జీలను ప్రభుత్వమే వాహనదారులకు చెల్లించాలి. రైతులే సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకుంటే రైతుల ఖాతాల్లో రవాణా ఛార్జీలు జమ చేయనున్నట్లు ప్రభుత్వం చెప్పింది. రవాణా ఛార్జీలకు సంబంధించి ప్రభుత్వం పక్కాగా నిబంధనలు సైతం విధించింది. ఎనిమిది కిలోమీటర్లలోపు దూరానికి రవాణా ఛార్జీ కింద రూ.324, ఎనిమిది నుంచి 20 కిలోమీటర్ల దూరం రవాణా చేస్తే కిలోమీటర్‌కు టన్నుకు రూ.ఏడు, 20 నుంచి 40 కిలోమీటర్ల దూరం ఉంటే కిలోమీటర్‌కు టన్నుకు రూ.6.50, 40 నుంచి 80 కిలోమీటర్ల దూరం ఉంటే కిలోమీటర్‌కు టన్నుకు రూ.ఆరు, 80 కిలోమీటర్లపైన దూరం ఉంటే కిలోమీటర్‌కు టన్నుకు రూ.5.50 చొప్పున ప్రభుత్వం రవాణా ఛార్జీలు నిర్ణయించింది. ధాన్యం రవాణాకు లారీలతోపాటు ట్రాక్టర్లను అధికారులు ఉపయోగించారు. ధాన్యం తరలించిన తర్వాత రైతుభరోసా కేంద్రంలో మిల్లులో జనరేట్ చేసిన ధాన్యం రవాణాపత్రం, సొసైటీ స్టాంప్, ఆర్‌బికె స్టాంప్, ట్రక్ డ్రైవర్ సంతకం, ట్రక్ కాపీ, లేదా ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ పత్రం వంటివి జత చేసి సివిల్‌సప్లయీస్ జిల్లా మేనేజర్ కార్యాలయంలో వాహన యజమానులు దరఖాస్తు చేసుకోవాలి. ధాన్యం తరలించిన 21 రోజుల్లో రవాణా ఛార్జీలు కిరాయి వాహనాలైతే యజమానుల ఖాతాల్లో, సొంతంగా రైతులే వాహనాలు పెట్టుకుని తరలిస్తే రైతుల ఖాతాల్లో రవాణా ఛార్జీలు జమ చేయాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు మొదలై నెలా పదిహేను రోజులు దాటిపోయింది. ఇప్పటి రవాణా ఛార్జీలు జమ కాలేదని లారీ, ట్రాక్టర్ల యజమానులు లబోదిబోమంటున్నారు.

రూ.పది కోట్లకుపైగా రవాణా ఛార్జీలు బకాయి

ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ తరలించిన ధాన్యానికి రవాణా ఛార్జీల నిమిత్తం రూ.పది కోట్లకు పైగా బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ రూ.కోటిన్నర వరకూ మాత్రమే జమైనట్లు తెలుస్తోంది. అదీ రైతులు సొంతంగా తరలించుకున్న వారికే జమైనట్లు సమాచారం. వాహనాదారులకు మాత్రం ఇంకా జమ కాలేదని తెలుస్తోంది. రవాణా ఛార్జీలు త్వరితగతిన జమ చేయాలని వాహనాల యజమానులు కోరుతున్నారు.

రబీ ధాన్యం తరలింపుపై ప్రభావం

మిల్లులకు ధాన్యం తరలించిన వాహనాలకు ఇవ్వాల్సిన రవాణా ఛార్జీలు సకాలంలో జమ చేయకపోవడం వల్ల రబీ ధాన్యం కొనుగోలులో తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి కన్పిస్తోంది. రవాణా ఛార్జీలు ఆలస్యమైతే రబీలో లారీ, ట్రాక్టర్ యజమానులు ధాన్యం తరలింపునకు తమ వాహనాలు పెట్టేందుకు ముందుకు రాని పరిస్థితి ఏర్పడనుంది. అదే జరిగితే రబీ ధాన్యం రవాణాలో తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి రానుంది. ఖరీఫ్‌లో ధాన్యం రవాణాలో లారీలు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రబీలోనూ ఇదే పరిస్థితి కొనసాగితే రైతుల ఇబ్బందులు మరింత తీవ్రతరమయ్యే ప్రమాదం ఉంది. వెంటనే లారీ, ట్రాక్టర్ యజమానులకు ఇవ్వాల్సిన ధాన్యం కిరాయి సొమ్మును ప్రభుత్వం వెంటనే జమ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఏలూరులో..

చీకటి జిఒ నెం.1ని రద్దు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు

రోడ్లు, ప్రధాన కూడళ్లలో ప్రదర్శనలు, సభలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెం.1ని తక్షణం రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడానికి పాదయాత్రలు, సభలు, ర్యాలీలు నిర్వహించలేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక గతాన్ని మరించి జిఒ నెం.1ని తీసుకురావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మికులు, ఉద్యోగులను అణచివేసే చర్యలు ఆపి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జగన్నాధరావు, సాయిబాబు, నాయకులు ప్రసాద్, సీతయ్య, జాన్‌బాబు, గోపి, లావేటి కృష్ణ, దుర్గారావు, నాగమణి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: జిఒ నెం.1ని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక చిన్న గాంధీబొమ్మ సెంటర్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నేత జి.రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెం.1ని తక్షణం రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హనుమాన్, కమలకుమార్, శ్రీనివాస్, మరిదాస్ దుర్గ, నాగమణి, పద్మాంజలి తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు: జిఒ నెం.1ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిడమర్రు సెంటర్లో జిఒ నెం.1 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, సంకెళ్ల మోహన్‌రావు, గవర సత్యనారాయణ, అంబల సాయిగణేష్, వెలగలేటి మోహన, లావేటి దుర్గారావు, కారు బుజ్జి, శోభన్ బాబు, కొప్పుల శ్రీనివాసు పాల్గొన్నారు.

చింతలపూడి: జిఒ నెం.1కి వ్యతిరేకంగా నిరసన చేపట్టకుండా సిఐటియు నాయకుల అక్రమ నిర్బంధం ప్రభుత్వానికి సిగ్గుచేటు అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.సత్యనారాయణ అన్నారు. సిఐటియు రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు స్థానికంగా ఆందోళన చేపట్టకుండా నారాయణను పోలీసులు గృహనిర్బంధం చేశారు. దీన్ని ఆయన ఖండించారు. శాంతియుతంగా నిరసన కూడా తెలియజేయకుండా అడ్డుకోవడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

వేలేరుపాడు: జిఒ నెం.1ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో జిఒ నెం.1 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మడివి దుర్గారావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు ధర్మాల రమేష్, వెంకటేశ్వర్లు, ఫ్రెండ్స్ ఆటో యూనియన్ అధ్యక్షులు కురిమెళ్ల శ్రీను, కార్యదర్శి మజ్జి శ్రీను, అఫ్రోజ్, రమేష్, లక్ష్మణ్ ఆది, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నగర వనం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న అటవీశాఖ అధికారులు

నగర వనం ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో నగర వనం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్ర ధామ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని రమణక్క పేట సమీపంలోని అటవీ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొత్తం 50 హెక్టార్లలో సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో నగర వనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి అటవీ భూములను పరిశీలించినట్లు తెలిపారు. ప్రకతిని కాపాడుకునే ఉద్దేశ్యం అడవులపై అవగాహన కల్పించేందుకు వీలుగా అటవీ శాఖ వివిధ ప్రాంతాల్లో నగర వనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతంలో మొట్టమొదటిసారిగా నగర వనం ఏర్పాటు చేయనుండటంతో పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయనతో పాటు జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ ఫారెస్ట్ అధికారి సౌజన్య, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీవాణి, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ధర్మారావు పాల్గొన్నారు.

సిఐటియు ఆలిండియా మహాసభ జయప్రదానికి పిలుపు



వేలేరుపాడులో..

వేలేరుపాడు : బెంగుళూరులో ఈనెల 18, 19, 20 తేదీల్లో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మడివి దుర్గారావు పిలుపునిచ్చారు. మండలంలోని ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ఆవరణలో ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మడివి దుర్గారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధర్మాల రమేష్, సిఐటియు మండల కార్యదర్శి బొగారి వెంకటేశ్వర్లు, ఫ్రెండ్స్ ఆటో యూనియన్ నాయకులు కురిమళ్ల శ్రీను, రమేష్, అఫ్రోజ్, గెడ్డం మల్లి, శ్రీను పాల్గొన్నారు.

నూజివీడు: బెంగుళూరులో జరిగే సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు నూజివీడు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో యూనియన్ జెండాను పట్టణ అధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ అనేక రూపాల్లో ఆందోళన చేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సిఐటియు నాయకులు జి.రాజు, చంద్రశేఖర్, కమల, పద్మాంజలి, మరియదాస్ నాగమణి, కుమారి, దుర్గ, సంసోను పాల్గొన్నారు.

ఎడ్లబండి పోటీలు

ఉత్సాహభరితంగా ఎడ్లబండ్ల పోటీలు

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పోటీలు కైకలూరులో ఉత్సాహభరితంగా సాగాయి. గురువారం మండలంలోని గోపవరంలో దీపక్ నెక్స్‌జన్ కంపెనీ, బండ్రెడ్డి ప్రభాకర్ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను మాజీమంత్రి కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. రైతులను ప్రొత్సహించేందుకు నెక్స్‌జన్ కంపెనీ ప్రతి ఏటా ఎడ్లబండి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించడం అభినందనీయమని ఆయన అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు, ఎడ్ల యజమానులకు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంపిపి అడవి కృష్ణ బహుమతులు అందచేశారు. మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వీరరాజరాజేశ్వరి, పార్టీ రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, లక్ష్మీ రాణి, వైసిపి, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడి పందేలకు ఏర్పాట్లు..!

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో శివారు మండలమైన ముదినేపల్లిలో సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు జోరుగా నిర్వహించేందుకు నిర్వాహకుల సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పలుగ్రామాల్లో చెరువు గట్లపై, గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నారు. కోడి పుంజులను ఇప్పటికే పందేలకు సిద్ధం చేశారు. ప్రతిఏటా ప్రభుత్వం హెచ్చరించడం, చివరకు పోలీసుల అదేశాలు బేఖాతార్ చేస్తూ పందేలకు దిగడం పరిపాటిగా మారుతోంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి మండలంలో కనిపిస్తోంది. మండలంలోని జానకిగూడెం, బొమ్మినంపాడు, ఈడేపల్లి దేవపూడి, వడాలి, ముదినేపల్లి, అన్నవరం, పేరూరు గ్రామాల్లో కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని పలుగ్రామాల్లో చేపలు, రొయ్యల చెరువుల మధ్య కోడిపుంజులను ప్రత్యేకంగా పెంచుతున్నారు. ముదినేపల్లిలో ఒక్కో పుంజు ధర రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు ధర పలుకుతుందని పందేలరాయుళ్లు చెబుతున్నారు. మండలంలో

కొత్తగా గురజ, చిగురుకోట, వాడవల్లి తదితర గ్రామాల్లో బరుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ముందుగానే బరులు సిద్ధం చేస్తే పోలీసులు వాటిని ధ్వంసం చేస్తారని, 13వ తేదీ రాత్రి బరులు సిద్ధం చేసేందుకు సిద్ధమవుతున్నారు. 14వ తేదీ భోగి పండుగ కనుక ఇబ్బంది ఉండదనే ఆలోచనలో పందేలరాయుళ్లు ఉన్నారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి

అంగన్వాడీల ఆందోళనలు

ప్రజాశక్తి - గణపవరం

అంగన్వాడీలకు ఫేస్ ఐడెంటిఫికేషన్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎమ్‌డి.హసీనాబేగం, నేత కె.ఝాన్సీలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హసీనాబేగం, ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ ఎం.సన్యాసిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రామకోటి, జయలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

భీమడోలు: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి తహశీల్దార్ షంషుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానుద్దేశించి సిఐటియు నేత జి.స్వర్ణకుమారి, అంగన్వాడీల నేతలు బి.రాజమణి, పార్వతి మాట్లాడారు.

కుక్కునూరు: అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌ఐకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వై.సాయికిరణ్ మాట్లాడగా మండల అధ్యక్షులు కుంజా నాగలక్ష్మి, అంగన్వాడీలు రాయి రమణ, బాడిస సుజాత, విజయ, సౌజన్య, రాజేశ్వరి, వరలక్ష్మి, రాధ, సంధ్యారాణి, జయసుధ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఎస్ఎస్.శాంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం రాజు, నేతలు కృపామణి, తెల్లం రామలక్ష్మి, కె.పుష్ప, నూర్జహాన్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గణపవరంలో..

ద్వారకాతిరుమల: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నాగలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్ట్ కార్యదర్శి కె.తులసి, సుకేషిని, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు సేవలందిస్తున్న అంగన్వాడీలను వేధించడం సిగ్గు చేటని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.వెంకట్రావు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం తహశీల్దార్ అల్లాడి వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావుతోపాటు మండల సహాయ కార్యదర్శి వై.సుజాత మాట్లాడారు. ఈ సందర్భంగా జిఒ నెం.1 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిహెచ్.రత్నకుమారి, కె.కనకమహాలక్ష్మి, ఎం.కరుణామ్మ, కె.భారతి, ఎ.లక్ష్మి, ఎం.ఝాన్సీ, జి.కుమారి, ఒ.అచ్యుత, కెవి.సుబ్బలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

చాట్రాయి: అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కొలికి పోగు భాస్కరరావు మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు జ్యోతిరాణి, సుమలత, శ్రీదేవి, విజయ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అంగన్వాడీలకు ఫేస్ ఐడెంటిఫికేషన్ అటెండెన్స్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు మాట్లాడారు.

చింతలపూడి: అంగన్వాడీలకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ కోరారు. సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు అధ్యక్షతన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు సరోజిని, మాణిక్యం, అరుణ, కవిత, శ్యామల, వర్ధిని పాల్గొని మాట్లాడారు.

ఏలూరు: అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ నేతలు ఎ.రజిని, కనకదుర్గ, అంతోనమ్మ, సుకన్య, విజయ, రోజా తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



బుట్టాయగూడెంలో..

కలిదిండి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ టి.తేజోమణికి అందచేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు ఎస్‌కె.అబిదా బేగం, నాయకులు జె.మేనక లక్ష్మి, కె.రమాదేవి, జె.పెద్దింట్లమ్మ, పి.పుష్ప, ఎమ్‌డి.పర్వీన్ సుల్తానా, విజయకుమారి, స్నేహ, రామలక్ష్మి, షాజాది, నజీర, ఎ.కుమారి పాల్గొన్నారు.

కైకలూరు రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కూరెళ్ల లాజరు, అంగన్వాడీ నాయకులు పి.సుజాత, జి.జ్యోతిరాణి, బిడి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ దాసరి సుధకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు పల్లిపాము రాజకుమారి మాట్లాడగా కె.శ్రీనివాసరావు, పిల్లి మురళీ, అంగన్వాడీలు డి.శ్యామల, కె.లక్ష్మి, ఆర్.విజయకుమారి, వి.రమాదేవి, కె.నాగమణి, కె.మేరి సులోచన, టి.బుజ్జి, బి.నారియమ్మ, పి.జయమ్మ, విఎల్.వాసంతి, సుకన్య, కె.రాణి, ఎంకె.దుర్గ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: అంగన్వాడీలపై వేధింపులు అరికట్టాలని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పసల సూర్యారావు, షేక్ సుభాషిణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జి.విమల అధ్యక్షతన అంగన్వాడీలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు, సుభాషిణి మాట్లాడారు. డిటి వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. హెచ్చరించారు. అనంతరం జిఒ నెం.1 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నేతలు లక్ష్మీదేవి, సత్యవేణి, శిరోమణి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్ల ఏర్పాటు వేగవంతం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

డొమెస్టిక్ మార్కెటింగ్ ఫిష్ ఆంధ్రా యూనిట్లు త్వరగా ప్రారంభమయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, మంజూరు చేసిన యూనిట్లు వీలైనంత త్వరగా ప్రారంభించేలా చూడాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫిష్ ఆంధ్రా యూనిట్లకు సంబంధించి జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ పథకం ద్వారా యూనిట్ వ్యయంపై జనరల్ కేటగిరిలో 40 శాతం మహిళలు/ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో 60 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ పథకం సద్వినియోగం చేసుకొనేందుకు వీలుగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాకు సంబంధించి మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్స్ 331 టార్గెట్ కాగా 174 మంది లబ్ధిదారులు కంట్రిబ్యూషన్ కింద రాగా 109 మందికి మంజూరు చేశామని, వీటిలో బ్యాంకు 26 అవుట్ లెట్స్‌కి మంజూరు చేసినట్లు చెప్పారు. స్కోప్స్ కింద త్రీ వీలర్స్‌కు 30 టార్గెట్ కాగా 36 గుర్తింపు కాగా బెనిఫిషరీస్ కంట్రిబ్యూషన్ కింద 16 మందికి, నాలుగు చక్రాలు ఎనిమిది టార్గెట్ కాగా 16 మందిని గుర్తింపు కాగా బెనిఫిషరీస్ కంట్రిబ్యూషన్ కింద 10 మందిని, డైలీ(10 లక్షలు) 31 టార్గెట్ కాగా 17 గుర్తింపు కింద ఇద్దరిని బెనిఫిషరీస్ కంట్రిబ్యూషన్ కాగా అలాగే సూపర్(రూ.20 లక్షలు) 10 మంది టార్గెట్ కాగా ఏడుగురిని గుర్తించామని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేపల ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడం మత్స్యకారుల జీవనప్రమాణాలు మెరుగుపరచడంతోపాటు ప్రజలకు పోషణ భద్రత కల్పించే లక్ష్యంతో ఫిష్ ఆంధ్రా యూనిట్ అమలవుతుందన్నారు. ఈ యూనిట్‌పై స్వయం సహాయక బృందాలను కూడా రాయితీపై చేర్చుకోవడం జరుగుతుందని తెలిపారు. యూనిట్ల ఏర్పాటుకు సంబంధించిన స్థలాలను పంచాయతీరాజ్, మున్సిపాలిటీ అధికారులు గుర్తించాలని కలెక్టర్ సూచించారు. వీటిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి పథకాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంక్ మేనేజరు ఎస్ఎస్.వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమడోలు ఎంఇఒపై అవినీతి ఆరోపణల వెల్లువ

ఉన్నతాధికారులకు యుటిఎఫ్ ఫిర్యాదు

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, భీమడోలు మండల విద్యాశాఖాధికారి డి.సాంబశివరావుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భీమడోలు మండలంలో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే క్రమంలో అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆధారాలతో సహా ఇప్పటికే యుటిఎఫ్ మండల శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ హోదాలో ఏలూరు మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడంపై చర్యలు తీసుకుంటామంటూ బాధ్యులకు మెమోలు జారీచేశారు. ఇదే క్రమంలో తన కార్యాలయ పరిధిలో పనిచేసే 450 మంది ఉపాధ్యాయులను వివిధ కార్యక్రమాలకు కేటాయించే విషయమై అవకతవకలకు పాల్పడ్డారని, లంచాలు తీసుకున్నారని పత్రికల్లో వార్తలు సైతం వచ్చాయి. దీనిపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేయడంతో విచారణ చేపట్టిన సమయంలో డిఇఒ గంగాభవాని సాంబశివరావును రాతపూర్వకంగా హెచ్చరించారు.

ఇదిలా ఉండగా తాజాగా మండలంలోని మల్కీ మహ్మద్‌పురం మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు ఎ.పురుషోత్తం అనారోగ్య కారణంగా ఇటీవల కాలును కోల్పోయారు. అతని వివరాలను సర్వీస్ రిజిస్టర్‌లో పొందుపరిచేందుకు పురుషోత్తం ఎంఇఒను సంప్రదించారు. దీనికోసం అతికష్టంపై తాను పని చేసే పాఠశాల నుండి పలుమార్లు ఎఇఒ కార్యాలయానికి వచ్చి ప్రాధేయపడినప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు. చివరకు లంచం ఇచ్చినప్పటికీ వివరాలను సర్వీస్ రిజిస్టర్‌లో పొందుపరచలేదు. దీంతో ఈ విషయాన్ని ఆయనతో పాటు పలువురు ఉపాధ్యాయులు యుటిఎఫ్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంఇఒను యుటిఎఫ్ నేతలు ప్రశ్నించగా అతి కష్టంపై ఆ వివరాలను సర్వీస్ రిజిస్టర్లో గత ఏడాది అక్టోబర్ 21న నమోదు చేశారు. దీనికి కక్షసాధింపుగా వికలాంగ ఉపాధ్యాయులకు జూలై 22 వరకూ చెల్లించాల్సిన ప్రత్యేక భృతిబిల్లును నిలిపివేశారు. వికలాంగ ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు స్పందించిన యుటిఎఫ్ మరోసారి ఎంఇఒను ప్రశ్నించగా ఆయన నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. బిల్లు పంపడానికి సైతం ఎంఇఒ మరికొంత మొత్తాన్ని ఆశిస్తున్నట్లు బాధిత వికలాంగ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. దీంతో పూర్తి వివరాలతో ఎంఇఒపై వచ్చిన ఇతర ఆరోపణలతో యుటిఎఫ్ ద్వారా ఆ ఉపాధ్యాయులు కలెక్టర్‌కు, ఆర్‌జెడికి, జిల్లా విద్యాధికారికి, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ భీమడోలు మండల శాఖ అధ్యక్షులు గోడే జోసఫ్ రవికాంత్ మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడిన ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనల మేరకు ప్రభుత్వపరంగా వికలాంగ ఉపాధ్యాయులు పురుషోత్తంకు న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లు మొత్తాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ విషయాలపై భీమడోలు ఎంఇఒను వివరణ కోరగా తనపై వచ్చిన విమర్శల్లో వాస్తవం లేదన్నారు.


ప్రధానోపాధ్యాయురాలిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు పూర్వవిద్యార్థుల సాయం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను మావులేటి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1984-89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.లక్ష విలువ గల ఫర్నీచర్‌ను మంగళవారం అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న చేబత్తిన ఏసుదాసుతో పాటు అందుబాటులో ఉన్న ఇతర పూర్వవిద్యార్థులు కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.కనకదుర్గ సునీతకు ఫర్నీచర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ పాఠశాలకు భవిష్యత్‌లో మరింత సహకారం అందిస్తామన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తొక్కుడుబియ్యపు సుమన్ బాబు, టివి.గోపాలకృష్ణ, వెంకటేష్ బాబు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ జేబు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

డివైఎఫ్ఐ జేబు క్యాలెండర్‌ను స్థానిక సూర్య విద్యాసంస్థల ప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆ విద్యాసంస్థలు యాజమాన్యం శ్రీనివాసరావు, రమాదేవి ద్వారా డివైఎఫ్ ఐ జేబు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో యువతి యువకులు విద్యార్థులు ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. యువతీ యువకులు భావితరాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. జూద క్రీడలను , మద్యం పానం అరికట్టి, సాంస్కృతిక కార్యక్రమాలతో పెద్ద ఎత్తున ఇంటింటా సంక్రాంతి సంబరాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూర్య విద్యాసంస్థల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందిస్తున్న సిపిఎం నాయకులు

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి రోడ్డున పడ్డ అంకన్నగూడెం పంచాయతీ దిబ్బగూడేనికి చెందిన సోడెం రాములమ్మ కుటుంబానికి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. అలాగే దాతలు, పాత్రికేయులు సహాయం చేశారు. బాధితులకు నిత్యావసర వస్తువులు, బియ్యం కూరగాయలు, బట్టలు తదితర సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో గుడెల్లి వెంకట్రావు, సిహెచ్.కొండలరావు పాల్గొన్నారు

గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి పరిధిలోని నాలుగు సచివాలయాలకు చెందిన మొదటి, రెండో గర్భిణులకు 67 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అదించినట్లు సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి మంగళవారం తెలిపారు స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభయాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ విల్సన్‌బాబు, హెచ్‌వి.పద్మనాగంపాల్గొన్నారు

మామిడి రైతులు అధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మామిడి పూత బాగా రావడానికి మామిడి కాయ కోత అనంతరం నీటి తడులు, సిఫార్సు చేసిన ఎరువులు వేయాలని ఉద్యానవనశాఖ అధికారి అమర్‌నాథ్ రైతులకు సూచించారు. నాగిరెడ్డిగూడెంలో మామిడి పూతదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి కోత అనంతరం నీటి తడులు, ఎరువులు వ్యవసాయాధికారుల సూచన మేరకు విధిగా వేయాలని, అక్టోబరు నెలలో చెట్లకు 13.0.45 ఎరువును ఐదు నుండి 10 గ్రాములు, చిలటెడ్ జింక్ రెండు గ్రాములు నీటిలో కరిగే బోరోన్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తేనె మంచు పురుగు, తామర పురుగుల నివారణకు థైయా మిథాక్షామ్, ఇమిడాక్లోఫ్రీడ్, డయాఫెన్ థూరాన్ మందులు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉద్యాన వన శాఖ సహాయకులు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కంటైనర్‌లో మంటలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

బాదంపూడి - తాడేపల్లిగూడెం మార్గంలో బాదంపూడి కాళీ కృష్ణ ఆశ్రమం సమీపంలో కంటైనర్‌లో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు కంటైనర్ వివిధ ఔషధాలు, దయపర్లు, తదితర సరుకులను అట్టపెట్టెల్లో తీసుకొని లారీ వెళ్తోంది. బాదంపూడి వద్దకు రాగానే లారీలో పొగలు రావడాన్ని అదేరూటులో వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు చూసి లారీ డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే లారీని పక్కగా ఆపి తలుపులు తీయగా అప్పటికే పొగలు కమ్ముకున్నాయి. తాడేపల్లి గూడెం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో ఆస్తి నష్టం లక్షల్లో ఉందని డ్రైవర్ చెబుతున్నారు. నష్టం విలువ అంచనా వేయాల్సి ఉంది.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని, నిత్యం వాహన తనిఖీలు చేస్తూ నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నామని ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిధిలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్ డివిజన్లతో పాటు, కైకలూరు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలోనూ విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు, రాత్రివేళ వాహన చోదకులకు వాష్ అండ్ డ్రైవ్ చేయిస్తున్నామన్నారు. తెలిపారు.

క్రీడలతో వ్యసనాలు దూరం

ప్రజాశక్తి - గణపవరం

పండుగ సమయాల్లో ఆటలపోటీలు నిర్వహించడం వల్ల యువత చెడువ్యసనాలకు దూరంగా ఉంటుందని, వారిలో క్రీడాసక్తిని పెరుగుతుందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. మంగళవారం గణపవరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా యువత కోడిపందేలు, జూదం, గుండాట వంటి చెడువ్యసనాలకు దూరంగా ఉండేందుకు ఆటల పోటీలు నిర్వహించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి, గణపవరం సిఐ ఎంవి.సుభాష్, ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, వైసిపి నాయకులు దండు రాము, దేగల కొండయ్య పాల్గొన్నారు.

బలివే శివాలయంలో షాపుల ఏర్పాటుకు వేలం

ప్రజాశక్తి - ముసునూరు

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని బలివే గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఆర్ఎస్ నెం.104/11 సర్వే నెంబరు భూమిలో దుకాణాల ఏర్పాటుకు ఆలయ అధికారులు, ఇఒ టి.విశ్వశరరావు పర్యవేక్షణలో మంగళవారం వేలంపాట నిర్వహించారు. హెచ్చు పాటదారునిగా పిల్లి రెడ్డియ్య రూ.10 లక్షల 50 వేలకు పాడుకున్నారు. కొబ్బరి చిప్పలను పోగు చేసుకునేందుకు పి.పరమేశ్వరి రూ.రెండు లక్షలకు పాడుకున్నట్లు తెలిపారు. గతేడాది కంటే ఈ సంవత్సరం రూ.1.99 లక్షలు అధిక ఆదాయం వచ్చిందని ఇఒ టి.విశ్వశరరావు తెలిపారు.

నాటుసారా తయారీదారులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - చింతలపూడి

నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. నాగిరెడ్డిగూడెంలో పరివర్తన-2 కార్యక్రమంలో భాగంగా కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అరుణకుమారి, అధికారులు అమర్‌బాబు పాల్గన్నారు.

ఉద్యోగులకు వైసిపి అండ : దూలం

ప్రజాశక్తి - కైకలూరు

ప్రభుత్వ ఉద్యోగులకు వైసిపి అండగా నిలుస్తుందని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. గురువారం రైల్వే స్టేషన్‌రోడ్‌లోని వైసిపి కార్యాలయంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ తూర్పు, కృష్ణ శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

స్వశక్తి సంఘాలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

మహిళల స్వశక్తి సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు సూచించారు. గురువారం ఎంఎల్‌ఎ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎపిఎంలు, సీసీలతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న గ్రామ సమైక్య సంఘాలు పనితీరు బాగుందని, ఇప్పటికే రెండుసార్లు పూర్తి చేసుకున్న సమైక్యలకు కొత్త పాలకవర్గాలను ఎన్నుకోవాలన్నారు. వివాదరహిత వ్యక్తులను ఎంపిక చేసుకుని ముందుకు సాగాలన్నారు.

నృత్య పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

సంక్రాంతి సందర్భంగా భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఎబిసి ఫౌండేషన్ వారు సంయుక్తంగా రాజమండ్రిలోని ఆనమ్ కళా కేంద్రంలో నిర్వహించిన 'సంక్రాంతి నంది పురస్కార సంబరాల్లో ఏర్పాటు చేసిన నాట్య ప్రదర్శనలో శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థినులు నాట్య ప్రదర్శనలతో అలరించారని ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. ఈ నృత్య పోటీల్లో తమ విద్యార్థులు ఏడుగురు నంది పురస్కారాలు గెలుచుకున్నారన్నారు. దాడి నందిని రెండు పురస్కారాలు, యామిజాల రిత్య సాయిశ్రీ, మరీదు మేఘనాసాయి, మరీదు స్నేహితసాయి, భూక్యా యజ్ఞసాయి, జల్లిపల్లి సోనాక్షి ఈ పురస్కారాలు అందుకున్నారు. వీరిని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

కోడిపందేల నిరోధానికి ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - ఉంగుటూరు

పేకాట, కోడిపందేలను అడ్డుకునేందుకు గ్రామస్థాయిలో సచివాలయం, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం నిఘా ఏర్పాటు చేయాలని డివిజినల్ పంచాయతీ అధికారి టి.అన్నామణి అన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, పోలీసు రెవెన్యూ యంత్రాంగంతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రమణారావు, పంచాయతీ విస్తరణాధికారులు షంశుద్దీన్, చంద్రశేఖర్, పివి.సత్యనారాయణ, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ జి.ఎలీషా హెచ్చరించారు. మంగళవారం మండలంలోని స్వర్ణవారిగూడెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి పండుగను ప్రతిఒక్కరూ సాంప్రదాయబద్ధంగా సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.

పలుచోట్ల గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - ముదినేపల్లి

జంగారెడ్డిగూడెంలో..

గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కొరగుంటపాలెం పంచాయతీ పరిధిలోని సీతారామపురం, ఈడేపల్లి గ్రామాల్లో మంగళవారం అధికారులతో కలిసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు వెంకటేశ్వరమ్మ, పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ప్రజల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజ అన్నారు. మంగళవారం స్థానిక 27వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్‌లు కంచర్ల వాసవి రత్నం, ముప్పిడి వీరాంజనేయులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం మండలంలో..

బొర్రంపాలెంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో మండలంలోని బచ్చులేటిగూడెం, రామమ్మగూడెం, టి.నరసాపురం నుంచి మొత్తం 11 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యతివ్వాలన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని జూదం, కోడిపందెం, గుండాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఆటగాళు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు.

గణపవరం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా గణపవరం డిగ్రీ కాలేజీ ఆవరణలో 10, 11, 12 తేదీల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం సిఐ ఎంవి.సుభాష్, ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.పదివేలు అందజేస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని క్రీడాకారులు పాల్గొవాలని వారు కోరారు.

ముసునూరు: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శరీరదారుఢ్యానికి దోహదపడతాయని తహశీల్దార్ దాసరి సుధ అన్నారు. ముసునూరులో జరుగుతున్న వాలీబాల్ మంగళవారంతో ముగిశాయి. ఫైనల్స్‌లో ముసునూరు సెయింట్ జోసఫ్ టీము విజయం సాధించిందని వ్యాయామ ఉపాధ్యాయులు బి.సుకుమార్ తెలిపారు. ఈ జట్టుకు రూ.5000, రెండో స్థానంలో నిలిచిన రమణక్కపేట జట్టుకు రూ.నాలుగు వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వి.కుమారి, సీనియర్ అసిస్టెంట్ డివిబి.చంద్రశేఖర్‌రావు, ఆర్ఐ మస్తాన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతలపూడి : యువత కోడిపందేలు, పేకాటకు దూరంగా ఉండాలని తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. మండలంలో జూనియర్ కళాశాల మైదానంలో సంక్రాంతి పండుగ సందర్భంగా యువత చెడు వ్యాసనాలకు, అంసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజాసుధాకర్, నగరపంచాయతీ కమిషనర్, ఎంఇఒ రామారావు, ఎంపిడిఒ మణికుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంత్రి పండుగను అందరితో కలిసి ఆనందంగా జరుపుకోవాలన్నారు.

జంగారెడ్డిగూడెం మండలంలో..

జంగారెడ్డిగూడెం: యువత సమాజంలో చెడు అలవాట్లకు లోను కాకుండా సాంప్రదాయ క్రీడలపై దృష్టి పెట్టాలని తహశీల్దార్ స్లీవ జోజి అన్నారు. మంగళవారం లక్కవరం పోలీస్ ప్రాంగణంలో వాలీబాల్ పోటీలను తహశీల్దార్‌తో పాటు ఎస్ఐ దుర్గ ఉమామహేశ్వరవు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లక్కవరం మహిళా పోలీసులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో..

స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంప్రదాయ వస్త్రధారణ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ నిర్మల కుమారి మాట్లాడుతూ పండుగ రోజుల్లో యువతీ యువకులు ఆనందంగా గడపడానికి ఆటల పోటీలు ఉపయోగపడతాయని, వారికి క్రీడలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. గ్రామాల్లో పండుగ రోజుల్లో యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా ఆటల పోటీలు నిర్వహించాలన్నారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ నిర్మలకుమారి బహుమతులు అదించారు. అనంతరం కాలేజీ ఆవరణలో భోగిమంటలు వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపల్ పి.మధురాజు, అధ్యాపకులు టి.అక్కరాజు, ఎన్‌విఎన్‌బి.శ్రీనివాస్, అనురాధ, శారదాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డివివి.చినసత్యనారాయణ పాల్గొన్నారు.

చింతలపూడి : మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం సంక్రాంతి పండుగ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మదన్ మోహన్‌రావు అన్నారు. సంక్రాంతి సంబరాలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, పాల పొంగలి తయారీ వంటివి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభాగ అధిపతి డాక్టర్ జి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు స్పోర్ట్స్: దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఏలూరు వన్ టౌన్ సిఐ బోనం ఆదిప్రసాద్ అన్నారు. గుడివాకలంకలో పోలీసుల ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడివాకలంక సర్పంచి రామారావు, వైస్ ప్రెసిడెంట్ మహారాజ్, గ్రామ పెద్దలు. ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్లలో నాగరత్నం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన నిర్వహించే మెగా వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యులు కల్లి సువర్ణ, లక్ష్మి, శశిధర్, బర్ల దశరథరామ్, యాని ప్రీతి వైద్య సేవలందిస్తారన్నారు.

'యువశక్తి సభను విజయవంతం చేయాలి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈ నెల 12వ తేదీ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో నిర్వహించే యువశక్తి సభకు యువత అధిక సంఖ్యలో తరలి రావాలని జనసేన చింతలపూడి నియోజకర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ఈ సభకు నియోజకవర్గం నుండి జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బొరగం శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుక

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రం బుట్టాయగూడెంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. తొలుత గజమాలతో సత్కరించి, భారీ కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు, పారేపల్లి నరేష్, తెలుగుదేశం పార్టీ బుట్టాయగూడెం మండల కన్వీనర్ సోంబాబు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, టి.నరసాపురం, కొయ్యలగూడెం మండలాల్లోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. : 4/2021 in OS No. 73/2014

పిటీషనరు/ DHR's:
1) Rapaka Prasada Rao (Died), 2) Rapaka Ratna Kumari, 3) Rapaka Narasimha Raju, 4) Vipparthi Surya Kumari, (2 to 4 Plaintiffs were added as legal representatives of the 1st Plaintiff as per the order in IA No.648/2015 dated 09.08.2016)
రెస్పాండెంటు/ JDR : Chatragadda Sri Ramulu

పై నెంబరు పిటీషనులో చాట్రగడ్డ శ్రీరాములు, తండ్రి : కృష్టాఫర్, నివాసం : 180-2/1, జంగారెడ్డి గూడెం అను వారికి నోటీసులు కోర్టు ద్వారాన్నూ, రిజిష్టరు పోస్టు ద్వారాన్నూ అమలు జరగనందున Substitute Service ద్వారా అమలు జరుపుటకు గాను ది. 03.02.203 తేదీన వాయిదా వేసినారు. కావున JDR/ Respondent సదరు వాయిదా రోజు ఉదయం గం.10:30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల JDR/ Respondent పరోక్షమందు పై పిటీషన్ తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

స్థలం : తాడేపల్లిగూడెం తేది: 10-01-2023

ఇట్లు : యమ్.వి.ఆర్. కృష్ణ మోహన్
పిటీషనర్/ డిహెచ్ఆర్‌ల తరపున అడ్వకేట్ తాడేపల్లి గూడెం.

పాస్‌పోర్టు పోయింది

ఏలూరి శ్రీనివాస రావు, తండ్రి: నాగేశ్వరరావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. సిద్ధాంతం గ్రామం నుండి పెనుగొండ జిరాక్స్ సెంటర్‌కి వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **G2920256** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకి తెలియజేయగలరు.

ఏలూరి శ్రీనివాసరావు
తండ్రి: నాగేశ్వరరావు, సిద్ధాంతం, పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా.
సెల్ : 63017 98056

పత్రికా ప్రకటన

నా క్లయింటున్నూ, ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు పట్టణ కాపురస్థులు **మొహమ్మద్ అజ్మతుల్లా గారి భార్య మేరుగు లక్ష్మి అనే "మొహమ్మద్ సన"** గారు నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింటు హిందు మతమునకు చెందినవారై "మేరుగు లక్ష్మి" అనే పేరుతో వ్యవహరించబడే వారు. దర్మిలా నా క్లయింటు నూజివీడు పట్టణ కాపురస్తులు **"మొహ్మమ్మద్ అజ్మతుల్లా, తండ్రి: అబ్దుల్ సలాం" అను వారిని ది.01-12-2013వ తేదీన ముస్లిం సంప్రదాయం ప్రకారం మతాంతర వివాహం చేసుకుని తన పేరున "మేరుగు లక్ష్మి" నుండి "మొహమ్మద్ సన" గా మార్చుకొని, అప్పటి నుండి "మొహమ్మద్ సన" పేరుతో వ్యవహరించ బడుచున్నారు.** కావున నా క్లయింటు తన పేరును "మేరుగు లక్ష్మి"కు బదులుగా "మొహమ్మద్ సన" అను పేరుతో వ్యవహరించ బడునని, ఇందు విషయమై ఎవరికైననూ ఏ విధమైన అభ్యంతరములు కానీ, ఆక్షేపణలు ఉన్ననూ ఈ ప్రకటన జారీ కాబడిన 15 రోజులలో ఈ దిగువ తెలియజేసిన చిరునామా నందు తెలియ జేసుకొనవలసిందిగా కోరడమైనది.

సయ్యద్ ఫరూఖ్
న్యాయవాది, నూజివీడు. సెల్: 99494 48597

మహారాజశ్రీ పాలకొల్లు అదనపు జూనియర్ సివిల్ జడ్జి-మరియు-జ్యుడిసియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ మొదటి తరగతి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 03/2022

బిట్వీన్:
యిళ్ళ నాగేశ్వరరావు ...వాది
VS
పెచెట్టి నరసమ్మ వగైరా ...ప్రతివాదులు

టు:
పెచెట్టి నరశింహారావు, డి-9, తండ్రి: శీతారామయ్య, ప్రస్తుత నివాసం తూర్పుపాలెం (మంగలిపాలెం), పోడూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో 9వ ప్రతివాది మీకు శ్రీ కోర్టు వారు దావా సామాన్లు అనేక పర్యాయములు పంపించినప్పటికీ మీరు తీసుకోనని కారణముగా శ్రీ కోర్టు వారి ఆదేశము ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా.., పై నెంబరు దావా మీయొక్క హాజరు నిమిత్తం **ది.20-01-2023వ తేదీకు శ్రీ కోర్టు వారు వాయిదా వేసియున్నారు.** కావున సదరు వాయిదా తేదీన శ్రీ కోర్టు వారు ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరై మీ అభ్యంతరములు తెలియజేసుకొనగలరు. లేని ఎడల మీ పరోక్షమున తదుపరి గ్రంధము జరుపబడును.

(శ్రీ కోర్టు వారు అనుమతితో)

ఐ.శివసాంభమూర్తి
కె.రాంబాబు,
అడ్వకేట్స్, పాలకొల్లు.
పాలకొల్లు,
02-01-23.